RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 415 | 04 శనివారం జూలై 2026. | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

# ప్రధాని మోదీకి 'చిన్న చెల్లెలు' వచ్చింది!

- జపాన్ ప్రధానిని చెల్లెలుగా సంబోధించిన ప్రధాని మోదీ
- షింజో అబేను అన్నయ్యగా భావించేదాన్నని వెల్లడించిన తకాయిచి
- తొలి భారత పర్యటనకు వచ్చిన జపాన్ తొలి మహిళా ప్రధాని తకాయిచి




భారత్, జపాన్ దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు నూతన శిఖరాలకు చేరుతున్నాయి. కేవలం అధికారిక చర్చలకే పరిమితం కాకుండా, ఇరు దేశాల అధినేతల మధ్య నెలకొన్న బలమైన వ్యక్తిగత అనుబంధానికి నిదర్శనంగా నిలిచి ఒక అరుదైన సన్నివేశం న్యూఢిల్లీలో ఆవిష్కృతమైంది. జపాన్ ప్రధానమంత్రి సనాయ్ తకాయిచిని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎంతో ఆత్మీయంగా తన 'చెల్లెలు' అని సంబోధించారు. న్యూఢిల్లీ వేదికగా జరిగిన 16వ భారత్-జపాన్ వార్షిక శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఈ ఆసక్తికర సంభాషణ చోటుచేసుకుంది. హైదరాబాద్ హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో, దివంగత మాజీ ప్రధాని షింజో అబేను తాను సొంత అన్నయ్యలా భావించేదాన్నని తకాయిచి గుర్తుచేసుకున్నారు. అబేకు ప్రధాని మోదీ అత్యంత సన్నిహితులు కావడంతో, తనూ ఆయనను అదే దృష్టితో చూస్తున్నానని ఆమె పేర్కొన్నారు. దీనికి స్పందించిన మోదీ, ఆమెను 'చిన్న చెల్లెలు' అని సంబోధించారు. ఈ అనుబంధంతోనే ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళతామని ఇరు నేతలు ఆకాంక్షించారు. జపాన్ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తకాయిచి భారత్‌లో జరిపిన తొలి అధికారిక పర్యటన ఇది. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య చరిత్రాత్మక ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా రక్షణ రంగంలో సంయుక్త అభివృద్ధి కోసం తొలిసారిగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆర్థిక, ఇంధన భద్రతపై ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించడంతో పాటు, రానున్న పదేళ్లలో జపాన్ నుంచి 10 ట్రిలియన్ యెన్ల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ సదస్సు ఇరు దేశాల మధ్య నెలకొన్న ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఒక నూతన అధ్యాయానికి నాంది అని ప్రధాని మోదీ అభివర్ణించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, ఇంధన రంగాల్లో పరస్పర సహకారంపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. స్వేచ్ఛాయుతమైన, నియమ నిబంధనలతో కూడిన ఇండో-పసిఫిక్ ప్రాంతం కోసం కలిసి పనిచేయాలని ఇరు దేశాల అధినేతలు నిర్ణయించారు.

# బీఆర్ఎస్ అప్పులు రూ.8.21 లక్షల కోట్లు కాదా?

## .. కేసీఆర్‌కు భట్టి సవాల్!



తెలంగాణ అప్పులపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈసారి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘాటు ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో భారీ అప్పులు చేశారని అన్నారు. అప్పులపై కేసీఆర్, హరీశ్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని భట్టి మండిపడ్డారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అప్పులు, ఆర్థిక వ్యవహారాలపై వివరాలు వెల్లడించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ పాలనలో మొత్తం రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు భట్టి తెలిపారు. ఇందులో చెల్లించకుండా వదిలేసిన బకాయిలు కూడా ఉన్నాయని చెప్పారు. పదేళ్ల పాలన అబద్ధాల పునాదులపై సాగిందని విమర్శించారు. ఈ భారీ అప్పులపై మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ అప్పుల కారణంగా రెండున్నరేళ్లలో అసలు, వడ్డీలు కలిపి రూ.2,08,061 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని భట్టి చెప్పారు. అయినప్పటికీ సంక్షేమ పథకాలను ఆపలేదన్నారు. అధిక వడ్డీ అప్పులను రీస్ట్రక్చరింగ్ చేయడం వల్ల వార్షిక వడ్డీ భారం రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గిందని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో సింగరేణిని సంక్షోభంలోకి నెట్టిందని భట్టి ఆరోపించారు. కొత్త కోల్ బ్లాకులు తీసుకురాలేదని విమర్శించారు. బొగ్గు మాయం ఆరోపణలపై ఇప్పటికే సింగరేణి విజిలెన్స్ విచారణకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. కొత్త కోల్ బ్లాకుల కోసం కేంద్రంతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తా..

## మీరు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా?: జూపల్లి



తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అప్పులపై అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. "తెలంగాణ అప్పులపై చర్చకు నేను సిద్ధం. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు సాయంత్రం 5 గంటలకు వస్తా. మరి బీఆర్ఎస్ నేతలు సిద్ధమేనా?" అంటూ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు.

"ఖబడ్దార్ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు. పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా తేల్చుకుందాం రండి" అని ధ్వజమెత్తారు. తన లెక్కలు తప్పు అయితే మంత్రి, ఎమ్మెల్యే పదవులకు తక్షణమే రాజీనామా చేస్తానని, మరి వారి లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తారా? బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని ఛాలెంజ్ చేశారు. కేసీఆర్ రాకపోతే జూపల్లి చెప్పే లెక్కలు నిజమేనని మీడియా ముందు ఒప్పుకోవాలని అన్నారు. అసెంబ్లీలో రాష్ట్ర అప్పులపై కేటీఆర్, హరీశ్‌రావు ఒక్కొక్కరు ఒక్కో రకమైన అబద్ధపు లెక్కలు చెప్పారని జూపల్లి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రంపై ఏకంగా రూ.8,21,651 కోట్ల అప్పుల భారం మోపారని ఆయన మండిపడ్డారు. కార్పొరేషన్ల ద్వారా దొంగచాటుగా తెచ్చిన అప్పులను వీరు ఎందుకు దాస్తున్నారని ప్రశ్నించారు. తాను ఆత్మగౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి, వ్యాపారాలు చేసుకుని రాజకీయాల్లోకి వచ్చానని.. పారిపోయే లక్షణం తనకు లేదని, అబద్ధాలు చెప్పే అలవాటు అంతకన్నా లేదని స్పష్టం చేశారు.

### అప్పుల లెక్కల్లో పొంతన లేదు.. మంత్రి చెప్పింది ఒకటి..

## సీఎం చెప్పింది మరొకటి : హరీశ్ రావు



రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని, ప్రభుత్వ పెద్దల మధ్యే లెక్కల్లో పొంతన లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన 'ఎస్ఐఆర్'పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రం చేసిన అప్పు రూ. 1,77,058 కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా తనకు లేఖ రాశారని తెలిపారు. అయితే, ఇదే అంశంపై నాలుగు నెలల క్రితం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం చేసిన అప్పు రూ. 3,45,294 కోట్లు అని చెప్పారని ఆయన గుర్తుచేశారు. ఒకే ప్రభుత్వంలోని మంత్రి ఒక లెక్క, ముఖ్యమంత్రి మరో లెక్క చెప్పడం గందరగోళానికి దారితీస్తోందని హరీశ్ రావు అన్నారు. అప్పుల విషయంలో ప్రభుత్వ పెద్దలు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ లెక్కల్లో ఏది నిజమో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# విజయవాడలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పవన్ కల్యాణ్ భేటీ



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం నాడు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సాయంత్రం పవన్ విజయవాడలోని లోక్ భవన్ కు వెళ్లారు. ఈ భేటీ చాలా ఆత్మీయంగా, ఫలప్రదంగా జరిగిందని పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా తెలిపారు. పలు అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారని, గవర్నర్ మార్గదర్శకత్వం, ఆతిథ్యం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకుముందు, పవన్ కల్యాణ్ మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో 'ఈగల్' విభాగం చీఫ్, సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈగల్ విభాగానికి సంబంధించిన వార్షిక నివేదికను ఐజీ, పవన్‌కు అందజేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సాధించిన ఫలితాలను నివేదికలో పొందుపరిచారు. అలాగే, సోషల్ మీడియాలో జరుగుతున్న వేధింపులు, ట్రోలింగ్, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై సైబర్ క్రైమ్ విభాగం తీసుకుంటున్న కఠిన చర్యల గురించి పవన్ కల్యాణ్‌కు వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది.

# తెలుగు రాష్ట్రాల ప్రజలకు అలర్ట్

## : నేటి నుండి 7 రోజుల పాటు దంచికొట్టనున్న వర్షాలు



నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో రాబోయే వారం రోజుల పాటు వాతావరణం పూర్తిగా మారిపోనుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో జులై 3 నుండి జులై 9 వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఈ మేరకు హైదరాబాద్, అమరావతి వాతావరణ కేంద్రాలు ఉమ్మడిగా వాతావరణ బులెటిన్‌ను విడుదల చేశాయి. రాబోయే 7 రోజుల పాటు రెండు రాష్ట్రాల్లోనూ ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని, కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని స్పష్టం చేశాయి.

తెలంగాణ వాతావరణ సూచన (జులై 3 - 9):

తెలంగాణ వ్యాప్తంగా జులై 9 వరకు విడతల వారీగా వర్షాలు కొనసాగుతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ముఖ్యంగా రాష్ట్రంలోని ఉత్తర జిల్లాలపై వీటి ప్రభావం ఎక్కువగా ఉండనుంది.

జులై 3 - 4: ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

జులై 4 - 5: ఉత్తర జిల్లాల్లో భారీ వర్షాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. జులై 5 - 9: రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు నిరంతరాయంగా కురుస్తూనే ఉంటాయి.

ఆంధ్రప్రదేశ్ వాతావరణ సూచన

ఏపీలోని ఉత్తర కోస్తా, యానాం, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో రాబోయే 7 రోజుల పాటు వాతావరణంలో తీవ్ర మార్పులు ఉంటాయి. కోస్తాంధ్రాలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షంతో పాటు గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. అయితే, రాబోయే ఐదు రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలలో ఎలాంటి పెద్ద మార్పులు ఉండబోవని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

రైతులు, ప్రయాణికులకు హెచ్చరిక

తీవ్రమైన ఉరుములు, మెరుపులు, ఈదురు గాలుల కారణంగా చేతికి వచ్చే దశలో ఉన్న పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. బలహీనంగా ఉన్న తాత్కాలిక నిర్మాణాలు, హోర్డింగులు కూలిపోయే అవకాశం ఉన్నందున ప్రయాణికులు, బహిరంగ ప్రదేశాల్లో ఉండేవారు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రైతులు పొలం పనుల సమయంలో చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
04 శనివారం జూలై 2026

# మళ్లీ మోగిన బడి గంట

## 20 ఏళ్లుగా మూతపడిన రత్తిరాం తండా ప్రభుత్వ పాఠశాల పునఃప్రారంభం..

## ప్రభుత్వ విద్యకు అండగా ప్రైవేట్ పాఠశాలల ప్రచారానికి ముందస్తు అనుమతి తప్పనిసరి





గీసుగొండ, జూలై 3 హైదరాబాద్ ఎస్టేట్:
ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలనే లక్ష్యంతో సూర్యతండా గ్రామపంచాయతీ తీసుకున్న చర్యలు ఫలించాయి. దాదాపు రెండు దశాబ్దాలుగా మూతపడిన రత్తిరాం తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శుక్రవారం పునఃప్రారంభమై 12 మంది విద్యార్థులతో తరగతులు ప్రారంభమయ్యాయి. ఇదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెంచేందుకు గ్రామంలో ప్రైవేట్ పాఠశాలల అడ్మిషన్ ప్రచారానికి గ్రామపంచాయతీ ముందస్తు అనుమతి తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకుంది. పాఠశాల పునరుద్ధరణ కోసం సూర్యతండా సర్పంచ్ బానోతు రాఘవేంద్ర చొరవ తీసుకుని సీఆర్పీలతో ఇంటింటి సర్వే నిర్వహించారు. గుర్తించిన విద్యార్థుల వివరాలతో సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్, డీఈవో, ఎమ్మెల్యేకు సమర్పించగా, కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో పాఠశాలను పునఃప్రారంభించారు. దీంతో ఇన్నాళ్లుగా మూడు కిలోమీటర్ల దూరంలోని కొమ్మాల ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాల్సిన చిన్నారులకు తమ తండాలోనే ప్రాథమిక విద్య అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గ్రామంలో ప్రైవేట్ పాఠశాలలు ప్రచారం నిర్వహించాలంటే గ్రామపంచాయతీ ముందస్తు అనుమతి తప్పనిసరి అని సర్పంచ్ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అర్హత కలిగిన ఉపాధ్యాయుల వద్దే విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఒకవైపు రెండు దశాబ్దాలుగా మూతపడిన ప్రభుత్వ బడిని తిరిగి తెరిపించడం, మరోవైపు ప్రభుత్వ విద్యకు గ్రామస్థాయిలో విధానపరమైన అండగా నిలిచే నిర్ణయాలు అమలు చేయడం జిల్లాలో చర్చనీయాంశమైంది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్థానిక సంస్థలు సంకల్పంతో ముందుకొస్తే మార్పు సాధ్యమేనని సూర్యతండా గ్రామపంచాయతీ ఆచరణలో చూపించింది.

## భద్రకాళి ఆలయం వద్ద కుడా చైర్మన్ వ్యాఖ్యలు

### కుడా వ్యవహారాలపై పలు ఆరోపణలు

### విచారణలు కొనసాగుతున్నాయని వెల్లడి



వరంగల్, జూలై 3 హైదరాబాద్ ఎస్టేట్:
భద్రకాళి ఆలయం సన్నిధిలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కుడా వ్యవహారాలపై పలు అంశాలను ప్రస్తావించారు. బీఆర్ఎస్ హయాంలో కుడా భూములు, నిధులు, టెండర్లు, లీజులపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన తెలిపారు. బాలసముద్రంలో విలువైన కుడా భూముల వినియోగం, 59 జీఓల అమలు, కాళోజీ కళాక్షేత్రం టెండర్లు, భద్రకాళి బండ్‌సుచిర్ ఇండియా కాంట్రాక్ట్ వంటి అంశాలపై ఇప్పటికే విచారణలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కాళోజీ కళాక్షేత్రం టెండర్లలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అలాగే పలు లీజు వ్యవహారాలపై కూడా విచారణలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రజా ఆస్తుల నిర్వహణలో పారదర్శకత అవసరమని, గతంలో జరిగిన నిర్ణయాలపై సమీక్షలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రాజకీయ ఆరోపణలపై ప్రజలు వాస్తవాలు గమనించాలని ఆయన సూచించారు. ఈ అంశాలపై సంబంధిత ప్రతిపక్ష వర్గాల స్పందన అందాల్సి ఉంది.

## కుడా భూముల వేలంపై ఇనగాల వివరణ

### పారదర్శక వేలం ద్వారా రూ.100 కోట్లకు పైగా ఆదాయం

### సమకూరిందని వెల్లడి

### ఆరోపణలను ఖండించిన చైర్మన్



హనుమకొండ, జూలై 3 హైదరాబాద్ ఎస్టేట్:
కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) భూముల వేలం పూర్తిగా చట్టబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించామని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తెలిపారు. ఈ వేలం ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.100 కోట్లకు పైగా ఆదాయం సమకూరిందని ఆయన పేర్కొన్నారు. మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి చేసిన ఆరోపణలను ఆయన ఖండిస్తూ, రాజకీయ విమర్శల్లో భాగంగానే నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఆరోపణలకు సంబంధించి ఆధారాలు ఉంటే సంబంధిత వేదికలపై ఉంచాలని ఆయన సూచించారు. శుక్రవారం తన నివాసంలో మీడియాతో మాట్లాడిన ఆయన, భద్రకాళి ఆలయానికి వెళ్లే సమయంలో కొన్ని కారణాల వల్ల పోలీసుల సూచన మేరకు అక్కడికే పరిమితమయ్యానని తెలిపారు. ఈ విషయంలో తాను చట్టానికి అనుగుణంగా వ్యవహరించానని చెప్పారు. కుడా ప్రతిష్టను దెబ్బతీసే విధంగా అవాస్తవ ప్రచారం చేయడం సరైంది కాదని, అవసరమైతే చట్టపరమైన మార్గాల్లో ముందుకు వెళ్లనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# పాడి రైతుల పరిస్థితిపై ఎన్డీడీబీ క్షేత్రస్థాయి అధ్యయనం

## గీసుకొండ మండలంలో పాల దిగుబడి, నాణ్యత, మార్కెటింగ్‌పై రైతుల నుంచి సమాచారం సేకరణ





గీసుకొండ, జూలై 3 హైదరాబాద్ ఎస్టేట్:
పాడి రంగ అభివృద్ధికి అవసరమైన క్షేత్రస్థాయి సమాచార సేకరణలో భాగంగా నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్డీడీబీ) ప్రతినిధుల బృందం శుక్రవారం గీసుకొండ మండలంలోని మరియాపురం, ఊకల్ గ్రామాల్లో పర్యటించింది. పాల దిగుబడి, పాల నాణ్యత, పాల మార్కెటింగ్, రైతులు పెంచుతున్న గేదెల జాతులు, వాటి ద్వారా లభిస్తున్న ఆదాయంపై పాడి రైతులతో నేరుగా మాట్లాడి సమాచారం సేకరించింది. పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పాడి రంగ అభివృద్ధికి అవసరమైన చర్యలపై రైతుల అభిప్రాయాలు, సూచనలను నమోదు చేసింది. ఈ పర్యటనలో ఎన్డీడీబీ సభ్యురాలు డాక్టర్ రాజేశ్వరి, సీనియర్ మేనేజర్ డాక్టర్ అరుణ్, డిప్యూటీ మేనేజర్ డాక్టర్ రాజేశ్వరరావు, డీఆర్డీఓ నాగ పద్మజ, ఏడీఆర్డీఓ శ్రీనివాస్, డీపీఎం వరలక్ష్మి, ఏపీఎంలు సారయ్య, ముక్కెర ఈశ్వరయ్య, ప్రగతి మండల సమాఖ్య అధ్యక్షురాలు గట్టు రాధికతో పాటు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

## ఫార్మా–డి పట్టభద్రులకు ఘన సన్మానం.. వైద్య సేవల్లో రాణించాలని ప్రముఖుల పిలుపు

## కేవీకే కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో వైభవంగా ఫార్మా–డి కాన్వకేషన్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 3:–
హైదరాబాద్: వనస్థలిపురంలోని పిస్తా హౌస్‌లో కేవీకే కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఫార్మా–డి2026 కాన్వకేషన్ వేడుక వైభవంగా జరిగింది. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రముఖుల చేతుల మీదుగా పట్టాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమానికి జేఎన్టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. సునీత రెడ్డి, ఏఐజీ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏ. చిరంజీవి రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేఈఎస్ సొసైటీ కార్యదర్శి, కరస్పాండెంట్ సతీష్ కడియాల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. సతీష్ చంద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఫార్మా–డి పూర్తిచేసిన విద్యార్థులకు క్లినికల్ ఫార్మసీ, ఔషధ పరిశోధన, ఫార్మాకోవిజిలెన్స్, ఆస్పత్రి సేవల రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. వైద్య బృందంలో క్లినికల్ ఫార్మసిస్టుల పాత్ర రోజురోజుకూ పెరుగుతోందని, రోగులకు సురక్షితమైన ఔషధ వినియోగం, నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వారు కీలక బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ వృత్తి నైతికతను పాటిస్తే దేశ విదేశాల్లోనూ ఉన్నత అవకాశాలు లభిస్తాయని తెలిపారు.
సతీష్ కడియాల మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యను సమాజ శ్రేయస్సుకు వినియోగిస్తూ సేవా భావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.




కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది.

# ఓటరు వివరాల నమోదులో ఖచ్చితత్వం పాటించాలి: కలెక్టర్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 3:–
రంగారెడ్డి జిల్లా: ఎల్బీ నగర్ పరిధిలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ల నుంచి సేకరించిన వివరాలను బీఎల్ఓ యాప్‌లో ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేసి, వారు సమర్పించిన వివరాలను వెంటనే యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.
ఓటరు జాబితాలో అనర్హుల పేర్లు, నకిలీ నమోదులు, ఓటరు గుర్తింపు కార్డులు వంటి లోపాలను గుర్తించి సరిదిద్దాలని సూచించారు. మరణించిన వారి పేర్ల తొలగింపు, నివాసం మారిన వారి వివరాల నవీకరణ వంటి అంశాలను నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని తెలిపారు. బీఎల్ఓలు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, నమోదు చేసే ప్రతి



వివరాన్ని రెండుసార్లు పరిశీలించి ఖచ్చితత్వాన్ని నిర్ధారించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు కూడా సరైన సమాచారం, అవసరమైన పత్రాలు సమర్పించడం ద్వారా తప్పులేని ఓటరు జాబితా తయారీలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో ఎన్నికల అధికారులు, మున్సిపల్ అధికారులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.



RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
04 శనివారం జూలై 2026

# ఊపిరి వదిలిన ఉద్యమ పాట

## అరుణోదయ నాగన్నకు అశ్రునివాళి




పాటనే ప్రాణంగా, ప్రజలనే కుటుంబంగా భావించిన ప్రజాగాయకుడు

తెలంగాణ ప్రజా సాంస్కృతిక ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసిన అరుదైన కళాకారుడు అరుణోదయం నాగన్న. తన గాత్రంతో వేలాది మందిని చైతన్యపరిచిన ఆయన ఇక లేరు అనే వార్త ప్రజా కళారంగాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. పాటను ఆయుధంగా, కళను సమాజ మార్పు సాధనంగా భావించిన నాగన్న తన సంపూర్ణ జీవితాన్ని ప్రజల కోసం, ఉద్యమాల కోసం, పార్టీ కోసం అంకితం చేశారు.

అరుణోదయ సాంస్కృతిక సంస్థల ద్వారా ఆయన పాడిన పాటలు కేవలం వినోదం కోసం కాదు; అవి అణగారిన వర్గాల ఆవేదనకు స్వరం, శ్రమజీవుల పోరాటాలకు ప్రేరణ, సామాజిక న్యాయం కోసం సాగిన ఉద్యమాలకు దిక్సూచిగా నిలిచాయి. ఎర్రజెండా ఉద్యమ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన గాత్రం విశేష పాత్ర పోషించింది.

గ్రామీణ జీవితపు కష్టాలను, రైతు–కూలీల సమస్యలను, సమానత్వ ఆకాంక్షలను ఆయన పాటలు ఎంతో హృద్యంగా ప్రతిబింబించాయి. సభలు, సమావేశాలు, నిరసన కార్యక్రమాలు ఎక్కడ జరిగినా నాగన్న గళం వినిపించేది. ఆయన పాట మొదలైతే ప్రజల్లో కొత్త ఉత్సాహం నిండేది. ఆయన స్వరంలో ఉన్న నిబద్ధత, భావోద్వేగం, పోరాట స్ఫూర్తి ప్రజలను,ఆలోచింపజేసేది

నాగన్న కేవలం గాయకుడు మాత్రమే కాదు; ప్రజా చైతన్యానికి అంకితమైన సాంస్కృతిక యోధుడు. వ్యక్తిగత సుఖసౌకర్యాల కంటే ఉద్యమ విలువలను గొప్పగా భావించిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శం. ఎన్నో దశాబ్దాల పాటు ప్రజల మధ్య తిరుగుతూ, వారి ఆశయాలను పాటల రూపంలో వినిపిస్తూ తన
జీవితాన్ని సార్థకం చేసుకున్నారు.

నేడు ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాడిన ప్రతి పాటలో, ఆయన నాటిన ప్రతి చైతన్యంలో, ఆయన ప్రేరేపించిన ప్రతి పోరాటంలో నాగన్న చిరంజీవిగా నిలుస్తారు. ప్రజల హక్కుల కోసం, సమాన సమాజ నిర్మాణం కోసం ఆయన ఆలపించిన గీతాలు తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి.

"గాయకుడు అస్తమించినా గానం అస్తమించదు. మనిషి దూరమైనా అతని ఆశయాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తాయి. అరుణోదయం నాగన్నలాంటి అమర ప్రజాగాయకుడు."
అశ్రునయనాలతో ఘన నివాళి

రమేష్ దారమళ్ళ

TY NEWS తెలుగు ,బ్యూరో చీఫ్

# రాగన్నగూడలో ఎస్ఐఆర్ కార్యక్రమం వేగవంతం

### "బీఎల్ఓల సమన్వయంతో ఇంటింటికీ చేరుకున్న బీఎల్ఏ బృందం"

### "ఓటరు వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ప్రజలకు సూచనలు"



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 3:-
రాగన్నగూడ (తొర్రూర్ డివిజన్): ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) కార్యక్రమంలో భాగంగా రాగన్నగూడ గ్రామంలోని 255, 256, 257 బూత్‌ల పరిధిలో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సూచనల మేరకు బీఎల్ఓలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, వాటిని సక్రమంగా నింపి అందజేయాలని ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ 53వ వార్డు అధ్యక్షుడు కోసికె ఐలయ్య, బీఎల్ఏ సూపర్‌వైజర్ కోంతం వెంకట్ రెడ్డి, బీఎల్ఏలు పన్నాల మధుసూదన్ రెడ్డి, పన్నాల శ్రీకాంత్ రెడ్డి, రమణ రెడ్డి, శేషన్ రాజు, మేకల పాండు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు కూడా కార్యక్రమానికి సహకరిస్తూ ఓటరు నమోదు ప్రక్రియలో చురుకుగా భాగస్వాములయ్యారు.

# వాహనదారులపై స్పెషల్ డ్రైవ్



కశింకోట బస్ స్టాండ్ వద్ద ప్రత్యేక వాహన తనిఖీలు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎంవీ చలాన్లు విధించారు. సీఐ స్వామి నాయుడు పర్యవేక్షణలో, కశింకోట పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె. లక్ష్మణరావు మరియు పోలీసు సిబ్బంది ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో హెల్మెట్ ధరించకుండా , నంబర్ ప్లేట్ లేకుండా , చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారిని గుర్తించి మోటారు వాహనాల చట్టం ప్రకారం ఎంవీ చలాన్లు విధించారు.ఈ సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సరైన నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని, చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు.ప్రజల ప్రాణ భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని కశింకోట పోలీసులు తెలిపారు.

# ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకతకు ప్రాధాన్యం

## రెండు చోట్ల ఓటు ఉంటే ఒకే చోటే కొనసాగించాలి

## : తహసీల్దార్ ఎం.డి. రియాజుద్దీన్





గీసుకొండ, జూలై 3 హైదరాబాద్ ఎస్టేట్:
కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని గీసుకొండ తహసీల్దార్ ఎం.డి. రియాజుద్దీన్ అధికారులను ఆదేశించారు. బూత్ స్థాయిలో ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, నకిలీ నమోదులు, మరణించిన వారి పేర్ల తొలగింపు, రెండు ప్రాంతాల్లో ఓటు ఉన్నవారిని ఒకే చోటకు పరిమితం చేసే ప్రక్రియను సమర్థంగా అమలు చేయాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 30 నుంచి జూలై 29 వరకు ఇంటింటి సర్వేను పూర్తి చేసి అర్హులైన కొత్త ఓటర్ల నమోదును వేగవంతం చేయాలని, ఓటర్ల జాబితాను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని ఆదేశించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు నివాస ధ్రువీకరణ పత్రంతో పాటు జనన ధ్రువీకరణ పత్రం, పదో తరగతి సర్టిఫికెట్, పాస్‌పోర్టు లేదా ప్రభుత్వం గుర్తించిన ఇతర ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పించాలని తెలిపారు. ఓటర్లు ఆన్‌లైన్ ద్వారా కూడా కొత్త నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వివాహిత మహిళలు తమ పుట్టింటి వివరాలను నమోదు చేయాలని, సందేహాల నివృత్తికి ఎన్నికల సంఘం 1950 హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీడీఓ వెన్న కృష్ణవేణి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసి జిల్లాలో గీసుకొండ మండలాన్ని ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ అధికారి ఉదయశ్రీ, ఆర్ఐలు సాంబయ్య, మధుచంద్ర, టీఓటీలు రాంబాబు, భాస్కర్, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

# కూడా భూ వేలం వివాదం..

## ప్రశ్నించిన వారినే లక్ష్యంగా అరెస్టులు జరిగాయన్న ఆరోపణలు





వరంగల్, జూలై 3 హైదరాబాద్ ఎస్టేట్:
కూడా భూ వేలం ప్రక్రియపై బీఆర్ఎస్ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంతో రాష్ట్రంలో రాజకీయ వేడి మరింత పెరిగింది. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూడా లేఔట్ భూ వేలం ప్రక్రియలో పారదర్శకతకు విఘాతం కలిగిందని ఆరోపించారు. గజానికి సుమారు రూ.1.50 లక్షల మార్కెట్ విలువ ఉన్న భూములను పోటీ లేకుండా సిండికేట్‌గా వ్యవహరించి రూ.60 వేల నుంచి రూ.65 వేలకే కేటాయించినట్లు విమర్శించారు. వేలం ప్రక్రియను ప్రశ్నించిన వారినే లక్ష్యంగా చేసుకుని అరెస్టులు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఎలాంటి ఆందోళనకు పిలుపునివ్వని తనను కూడా ముందస్తు చర్యల పేరుతో అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో జరగాల్సిన టెండర్ ప్రక్రియను ఆఫ్‌లైన్‌లో నిర్వహించడం వల్ల అనుమానాలకు తావిచ్చిందని ఆయన తెలిపారు. పలు వర్గాల పాల్గొనడాన్ని అడ్డుకోవడం ద్వారా పోటీ తగ్గించి భూములు తక్కువ ధరలకు కేటాయించబడినట్లు ఆయన విమర్శించారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని, జరిగిన వేలాన్ని రద్దు చేసి పూర్తిస్థాయి పారదర్శకతతో ఆన్‌లైన్ విధానంలో తిరిగి నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా ఆస్తుల విషయంలో పారదర్శకత తప్పనిసరి అని, లేకపోతే వ్యవస్థపై అనుమానాలు మరింత పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర పాలనపై ప్రజలు గమనిస్తున్నారని, ఈ అంశంపై తుది తీర్పు ప్రజలదేనని దాస్యం వినయ్ భాస్కర్ వ్యాఖ్యానించారు.

# రేడియల్ రోడ్డు – 2కు రైతుల గ్రీన్ సిగ్నల్




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 3:-
రంగారెడ్డి జిల్లా: శంషాబాద్‌షాద్‌నగర్ డివిజన్ పరిధిలో చేపట్టనున్న రేడియల్ రోడ్డు–2 నిర్మాణానికి అవసరమైన భూసేకరణ అంశంపై జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. కొందుర్ మండలంలోని ముట్‌పూర్, చుక్కమెట్, ఉమ్మెత్యాల్, లాలాపేట్ గ్రామాలతో పాటు చౌదర్‌గూడ మండలంలోని తుమ్మపల్లి గ్రామ రైతులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రాజెక్టు వల్ల ప్రాంతానికి కలిగే ప్రయోజనాలు, భూసేకరణ విధానం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందించే పరిహారం తదితర అంశాలను రైతులకు వివరించారు. రైతులు తమ సందేహాలు, సూచనలను వెల్లడించగా, వాటిపై అధికారులు స్పష్టత ఇచ్చారు. చర్చలు సానుకూలంగా సాగడంతో ప్రభుత్వం ప్రతిపాదించిన కన్సెంట్ అవార్డు ద్వారా పరిహారం స్వీకరించేందుకు రైతులు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. పరిహారం అందిన అనంతరం ప్రాజెక్టు కోసం అవసరమైన భూమిని అప్పగించేందుకు కూడా సమ్మతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి ప్రతి అర్హ రైతుకు నిబంధనల మేరకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రేడియల్ రోడ్డు–2 పూర్తయితే షాద్‌నగర్ ప్రాంత అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడి రవాణా, పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. సమావేశం అనంతరం భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి ప్రాజెక్టు పనులను త్వరలోనే ముందుకు తీసుకెళ్లనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# హెపటైటిస్ నిర్మూలనకు సమన్వయంతో ముందుకు




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 3:-
రంగారెడ్డి జిల్లా: కొంగర కలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జాతీయ వైరల్ హెపటైటిస్ నియంత్రణ కార్యక్రమం అమలుపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం అదనపు జిల్లా కలెక్టర్ డా. కిరణ్ మయి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో హెపటైటిస్ బి, సి వ్యాధుల నివారణ, ముందస్తు గుర్తింపు, పరీక్షలు, చికిత్స సేవల విస్తరణ, ప్రజలకు అవగాహన కల్పించే చర్యలపై అధికారులు సమీక్ష నిర్వహించారు. సంబంధిత శాఖలు పరస్పర సహకారంతో పనిచేస్తూ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని అదనపు జిల్లా కలెక్టర్ సూచించారు.

ప్రతి అర్హుడికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, గ్రామీణ ప్రాంతాల్లోనూ అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణ కుమారి మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. వ్యాధి నిర్ధారణ, చికిత్స, అనంతర పర్యవేక్షణతో పాటు ప్రజల్లో అవగాహన పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. అన్ని శాఖల సహకారంతో కార్యక్రమ లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, వివిధ ఆరోగ్య కార్యక్రమాల బాధ్యులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# పరిశుభ్రతకు ప్రాధాన్యం.. శానిటేషన్ సిబ్బందికి ఎమ్మెల్యే సూచనలు

### – ఆదిభట్ల సర్కిల్ పారిశుద్ధ్య పనితీరుపై సమీక్ష
### – చెత్త సమస్యల పరిష్కారానికి నెలరోజుల కార్యాచరణ
### – ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన కాలనీల లక్ష్యం
### – శానిటేషన్ సిబ్బంది సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్న ఎమ్మెల్యే

రంగారెడ్డి జిల్లా: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి జీహెచ్ఎంసీ ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తుర్కయంజాల్, ఆదిభట్ల డివిజన్ల పారిశుద్ధ్య వ్యవస్థపై అధికారులతో, శానిటేషన్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణమే ప్రజారోగ్యానికి బలమైన పునాది అని అన్నారు. కాలనీల్లో చెత్త ఎక్కువగా పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణతో శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. ప్రతి సూపర్‌వైజర్, సిబ్బంది తమ పరిధిలో నిర్దేశించిన లక్ష్యాలను నెలరోజుల్లో పూర్తి చేసి పురోగతిని నివేదించాలని ఆదేశించారు. అధికారులు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సిబ్బంది హాజరు, పనితీరును పర్యవేక్షించడంతో పాటు డ్రైనేజీ సమస్యలు, చెత్త పేరుకుపోవడం వంటి ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు సమాజ ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. వారి వేతనాలు, సంక్షేమ అంశాలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. పరిశుభ్రతను కేవలం ప్రభుత్వ బాధ్యతగా కాకుండా ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.



# రాగన్నగూడ ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలపై సీపీఎం ఆందోళన

### "ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి: పగడాల యాదయ్య"

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 3:–
సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జీహెచ్ఎంసీ ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని రాగన్నగూడ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం చూపుతోందని విమర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతి గదులు లేవని, హైస్కూల్ విద్యార్థులకు వర్క్‌బుక్స్ అందకపోవడంతో పాటు 6, 7వ తరగతి విద్యార్థులకు కొన్ని పాఠ్యపుస్తకాలు ఇంకా అందలేదని పేర్కొన్నారు. తాగునీటి సౌకర్యం సరిగా లేకపోవడం, మరుగుదొడ్ల కొరత, పారిశుద్ధ్య సమస్యలు కూడా ఉన్నాయని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పలుమాసాలుగా బిల్లులు, వేతనాలు అందక బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. పాఠశాలకు సరఫరా చేస్తున్న బియ్యం నాణ్యతపై కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు.
అటెండర్ పోస్టులతో పాటు ఖాళీగా ఉన్న ఇతర పోస్టులను వెంటనే భర్తీ చేసి, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులను ఆయన కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా, మండల నాయకులు, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ: మల్‌రెడ్డి రాంరెడ్డి

### "ఉద్యమకారుల త్యాగాలకు గౌరవం కల్పిస్తున్నాం: మల్‌రెడ్డి రాంరెడ్డి"

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతిదీ జూలై 3:–
ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చింతల్‌కుంట మల్లికార్జున నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉద్యమకారుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.
తెలంగాణ రాష్ట్రం వేలాది మంది విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజాసంఘాలు, ఉద్యమకారుల త్యాగాల ఫలితంగా ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని, ఆ నిర్ణయం తీసుకున్న సోనియా గాంధీ సేవలను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. ఉద్యమం పేరుతో అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం ఉద్యమకారులకు తగిన గుర్తింపు ఇవ్వడంలో విఫలమైందని, వారి ఆశయాలు పక్కనపడ్డాయని విమర్శించారు. ప్రజలు గత ఎన్నికల్లో ఇచ్చిన తీర్పు ఆ పాలనపై అసంతృప్తికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.




ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు గౌరవం కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన శ్రీకాంత చారి కుటుంబానికి గుర్తింపు ఇవ్వడం, ఉద్యమకారుల కమిటీ ఏర్పాటు వంటి చర్యలు ఇందుకు ఉదాహరణలని వివరించారు.
రైతు భరోసా, రుణమాఫీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, పారదర్శక ఉద్యోగ నియామకాలు, మూసీ పునరుజ్జీవనం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కాపాడుతూ ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.
ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల కమిటీ సభ్యుడు శోభన్ రెడ్డి, ఉద్యమకారుల హక్కుల సాధన సమితి అధ్యక్షుడు రొక్కం లక్ష్మారెడ్డి, పలువురు ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా నూతన కమిటీలో కీలక బాధ్యతలు కేఎల్ఆర్

### మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల మర్యాదపూర్వక భేటీ!

( హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 03:)

రంగారెడ్డి జిల్లా నూతన కమిటీలో.. కీలక బాధ్యతలు నిర్వహించిన –పుట్టగల జగన్ (రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్)–ఢిల్లీ శ్రీధర్ (రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ)–గుల్షన్ (రంగారెడ్డి జిల్లా స్పోక్స్ పర్సన్)
నియమితులైన సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ని మరియు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు శ్రీ దేప భాస్కర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.
ఈ సందర్భంగా మాట్లాడుతూ..నూతన పదాధికారులకు శాలువాలు కప్పి, హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో రంగారెడ్డి జిల్లాతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉంటూ పార్టీ ప్రతిష్టను మరింత పెంచేలా పనిచేయాలని ఈ సందర్భంగా వారు నూతన నాయకులకు దిశా నిర్దేశం చేశారు.



# బొంగ్లూర్‌లో ఎస్ఐఆర్ పనులను ఆకస్మికంగా పరిశీలించిన ఈఆర్ఓ



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 3:–
రంగారెడ్డి జిల్లా: బొంగ్లూర్ ప్రాంతంలోని 131వ పోలింగ్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమం కింద ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) శ్రీనివాస్ రెడ్డి ఆకస్మికంగా క్షేత్రస్థాయిలో పర్యటించి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి స్వయంగా ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారమ్‌ను అందజేసి పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఫారమ్‌ల పంపిణీ, నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి ఇంటికి చేరుకుని నిర్ణీత గడువులో నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఓటరికి ఫారమ్‌లు సకాలంలో అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ బి. సత్యనారాయణ రెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బి.ఎన్.కె. రమేష్, బీఎల్ఓ సూపర్వైజర్, సంబంధిత బీఎల్ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

# వైభవంగా ధ్వజస్తంభ మహోత్సవం



గీసుకొండ, జూలై 3 హైదరాబాద్ ఎస్టేట్: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాల గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా కొనసాగుతున్నాయి. జూలై 2 నుంచి 5 వరకు నిర్వహిస్తున్న ఈ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేదోక్త క్రతువులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం యాగశాలలో అగ్ని ప్రతిష్ఠ నిర్వహించి, నూతన ధ్వజస్తంభానికి పంచగవ్యాధివాసం చేపట్టారు. అనంతరం సాయంత్రం జలాధివాస కార్యక్రమాన్ని వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తిపారవశ్యం నెలకొనగా, భక్తులు విశేష సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి, ఆలయ అర్చకులు, మహోత్సవ దాతలు వేములపల్లి సంతోష్ దంపతులు, ఆలయ సిబ్బంది, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

# ఎండి తండా గ్రామస్తులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 03:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని తుక్కుగూడ పార్టీ ఆఫీసులో.. మాజీ ఎమ్మెల్యే మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ కిచెన్ గారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఎన్డీ తండా గ్రామ పంచాయతీకి చెందిన అంబోత్ హేమ్ల నాయక్ కి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ ని అక్షరాల 42, 500/– రూపాయలను కేఎల్ఆర్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో అరుణ గోపాల్ నాయక్ ఉపసర్పంచ్, సురేఖ సురేష్ వార్డు సభ్యులు రాణి దేవేందర్ గ్రామ శాఖ అధ్యక్షులు శరత్ నాయక్ ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు నాగేందర్ నాయక్ రవి నాయక్ ఏ హరి సింగ్ నాయక్ లక్ష్మణ్ నాయక్ తదితరులు యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

# మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా... వెంకన్న నియామకం



హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి)
తుంగతుర్తి నియోజకవర్గం మద్దిరాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పచ్చిపాల వెంకన్నను స్థానిక శాసనసభ్యులు మందుల సామెల్ నియామక పత్రం అందజేయడం జరిగినది . అనంతరం స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంకన్న నాయకత్వంలో పార్టీ బలోపేతం కావాలని ప్రజలకు చేరువ అయ్యేలా బాధ్యత వహించాలని ఆకాంక్షించారు. అనంతరం వెంకన్న నియామకం తెలుసుకున్న పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయననుఅభినందించారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు మండల బాధ్యులు అప్పజెప్పడంతో మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు తీరుస్తానని వారన్నారు. ఈ కార్యక్రమంలో పచ్చిపాల సుమతి, వల్లపు రమేష్, అశోక్ రెడ్డి, చంద్రశేఖర్,ధనియాల శంబయ్య మరి వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
04 శనివారం జూలై 2026

## పదవి విరమణ పొందిన ఉపాధ్యాయురాలు స్వరూపం సత్కరించిన.....రత్నాకర్



మండలం లోని మార్టూరు ప్రధానోపాధ్యాయురాలు ఎం ఎం స్వరూప ఉద్యోగ విరమణ సందర్భంగా గురువారం అనకాపల్లిలో ఘన సత్కారం జరిగింది. ముందుగా స్వరూప ను డైట్ విద్యా సంస్థల అధినేత దాడి రత్నాకర్ సత్కరించారు. ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండల శాఖ అధ్యక్షుడు కొణతాల గణేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర మాజీ కార్యదర్శి బి వెంకటపతి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై శ్రీనివాసరావు, ఎస్ దుర్గాప్రసాద్, మాజీ జిల్లా అధ్యక్షులు ధర్మారావు, మండల కార్యదర్శి కిరీటి, జిల్లా మాజీ కార్యదర్శి సన్యాసినాయుడు, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, రాష్ట్ర కార్యదర్శులు పెనుమత్స కృష్ణంరాజు, వరప్రసాద్, రెడ్డి నారాయణరావు, పీలా నారాయణరావు, శివాజీ, గోపి, అప్పలరాజు, మార్టూరు మాజీ సర్పంచి రెవిన్యూ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఓట్లు నమోదు ప్రక్రియ వేగవంతం చేయండి...



ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం జీవీఎంసీ పరిధిలో అనకాపల్లి పట్టణంలో 194వ బూత్ బూత్ లెవెల్ ఆఫీసర్ ముత్త శ్రీలక్ష్మి 195వ బూత్ లెవెల్ ఆఫీసర్ కూనిశెట్టి భార్గవ్ ప్రకాష్ రెండు బూతులకు సంబంధించిన ఓటర్లను ఓటు వివరాలు తెలియజేసి ఓటర్ల నుండి వివరాలు సేకరిస్తున్నారని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ తెలుగుదేశం పార్టీ నాయకులు కుప్పిలి జగన్ ఆధ్వర్యంలో ఓటు అప్లికేషన్ ఇచ్చి ఒక్క కరుణించి దరఖాస్తులను పూర్తి చేయడం జరుగుతుందని జగన్ తెలియజేశారు. ఓట్లు నమోదు కార్యక్రమం సమయం తక్కువగా ఉన్నప్పటికీ బిఎల్వోలు ఓటర్లకు సహకరించి సమయం కేటాయిస్తున్నారని, కొంతమంది ఓటర్లు చనిపోవడం, అద్దె ఇంట్లో ఉన్నవారు మారిపోవడం, నూతన ఓటర్లు 18 సంవత్సరాలు వచ్చిన వారు ఫారం 6 నమోదు చేయడం వంటి పనులకు తెలుగుదేశం కార్యకర్తలు సహకరిస్తున్నారని జగన్ అన్నారు. ఈ కార్యక్రమంలో అయిత అప్పలనారాయణ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సిపి బిఎల్ఎ తో సమాసమైన బొడ్డేడ శివ



నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయ కర్త మలశాల భరత్ కుమార్ ఆదేశాలతో 81 వ వార్డ్ ఇంచార్జ్ బొడ్డేడ శివ కార్యాలయం లో 81 వ వార్డ్ వైఎస్ఆర్సిపి బిఎల్ఏ లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బొడ్డేడ శివ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అనకాపల్లి నియోజకవర్గ పరిధిలోని అన్ని వార్డ్ లలో వై ఎస్ ఆర్ సి పి గెలవాలి అని, ఆది జరగాలంటే ప్రభుత్వం చేపట్టిన సార్ ప్రోగ్రామ్ లో బి ఎల్ ఎ ల పాత్ర చాలా కీలకం అన్నారు.ప్రతి వై ఎస్ ఆర్ సి పి సానుభూతి పరుల ఓట్లు పోకుండా చూసుకోవలసిన బాధ్యత బి ఎల్ ఎ లేదని అన్నారు.81 వ వార్డ్ లో పని చేస్తున్న 81 వ వార్డ్ వైజ్ ప్రెసిడెంట్ సుంకర వెంకటేశ్వర రావు,81 వ యూత్ ప్రెసిడెంట్ బుద్ద జగన్, రైతు విభాగం అధ్యక్షుడు ఆడారి బుచ్చి రాము, టౌన్ బూత్ కమిటీ సెక్రటరీ పేతకం శెట్టి గోపి.పట్టణ వై ఎస్ ఆర్ సి పి కార్యదర్శి వాసుపల్లి తాతీయలు,81 వ వార్డ్ జనరల్ సెక్రటరీ కాండ్రేగుల వెంకట సాంబ శివ, పెంటకోట సంతోష్, 81వ వార్డు సోషల్ మీడియా ప్రెసిడెంట్ రాపేటి మహా లక్ష్మీ నాయుడు,చింతా కోటి, 81వ వార్డు రైతు విభాగం జనరల్ సెక్రటరీ కాండ్రేగుల శ్రీను. నిరీక్షణ 81వ వార్డు సీనియర్ నాయకులు కొణతాల గోవింద్, బొడ్డెడ రాజేష్, కాండ్రెగుల శంకర్ లను అభినందించారు, ఈ కార్యక్రమంలో వై ఎస్ ఆర్ సి పి ఆఫీస్ ఇంచార్జ్ షణ్ముఖ పాల్గొన్నారు.

## రోడ్లు, డ్రైనేజీలను పరిశీలిస్తున్న.... సుందరపు



ఎలమంచిలి నియోజకవర్గంలోని రాంబిల్లి మండలం వాడ నరసాపురం గ్రామంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పర్యటించి గ్రామంలోని రోడ్లు, డ్రైనేజీల పరిస్థితిని పరిశీలించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు వంటి సమస్యలను దశలవారీగా పరిష్కరించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ఎస్టేట్ దేవరకొండ ప్రతినిధి

## :- ఘనంగా ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ జన్మదిన వేడుకలు





దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే బాలు నాయక్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రజాప్రతినిధులు పార్టీ ముఖ్య నాయకులు అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ గారితో పాటు వారి సతీమణి జ్యోతి ప్రసన్న కుమారుడు దేవరన్ నాయక్ పుష్పగుచ్చాలతో శాలువాలతో ఘనంగా సత్కరించి గజమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ తన జన్మదినాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపేందుకు విచ్చేసిన నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు

ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్ పార్టీ నాయకత్వం సహకారంతో దేవరకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని అన్నారు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి గ్రామ అభివృద్ధి ప్రతి కుటుంబ సంక్షేమమే తన లక్ష్యమని పేర్కొన్నారు

ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉన్న కైలాష్ నేత దేవరకొండ నియోజకవర్గం అన్ని మండలాల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## వారం రోజుల్లోనే చోరీ కేసు ఛేదించిన మహేశ్వరం పోలీసులు..

## సిబ్బందికి ఉన్నతాధికారుల అభినందనలు

( హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూలై 03:)

గత నెల జూన్ 27న పీఎస్వై కన్వెన్షన్‌లో నిర్వహించిన రాజకీయ సభ సందర్భంగా అపహరణకు గురైన నగదు,బంగారు ఆభరణాలను మహేశ్వరం పోలీసులు కేవలం వారం రోజుల్లోనే రికవరీ చేసి బాధితులకు అప్పగించారు.ఈ కేసులో 15 తులాల బంగారం,రూ.2,55,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ కె.నారాయణ రెడ్డి,ఏసీపీ జానకి రెడ్డి,సీఐ రాఘవేందర్ రెడ్డి,ఎస్ఐలు రాఘవేందర్,ప్రసాద్,ధనుంజయ్ తదితరులు కేసు వివరాలను వెల్లడించారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ దృశ్యాలు,ప్రత్యేక దర్యాప్తు బృందం సహకారంతో నిందితులను గుర్తించి,పోయిన నగదు,బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.కేసు ఛేదనలో కీలకంగా పనిచేసిన కానిస్టేబుళ్లు శివరాజ్,అనిల్,ప్రవీణ్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు.వారి సమర్థవంతమైన విధి నిర్వహణను ప్రశంసిస్తూ ప్రశంసాపత్రాలు అందజేశారు.తమ విలువైన బంగారం,నగదు తక్కువ సమయంలోనే రికవరీ చేసి అప్పగించిన మహేశ్వరం పోలీసులకు బాధితులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల ఆస్తుల రక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా పనిచేస్తారని అధికారులు పేర్కొన్నారు.





## అక్రిడిటేషన్ ప్రక్రియపై సీనియర్ జర్నలిస్టు పర్కాల సమ్మయ్య గౌడ్ ఆవేదన:

మేడారం న్యూస్ హైదరాబాద్ జూలై 3

తెలంగాణలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియపై క్షేత్రస్థాయి పాత్రికేయుల్లో అసంతృప్తి పెరుగుతోందని, ముఖ్యంగా అక్రిడిటేషన్ కమిటీల పనితీరుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని అఖిల భారతీయ జర్నలిస్టు ప్రొడక్షన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షులు పర్కాల సమ్మయ్య గౌడ్ ఒక పత్రిక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఎన్నో కష్టాలు పడుతూ వార్తల సేకరణలో నిమగ్నమయ్యే వర్కింగ్ జర్నలిస్టులకు కఠినమైన అర్హతలు, పలు నిబంధనలు అమలు చేస్తున్నప్పుడు, ఆ అర్హతలను నిర్ణయించే కమిటీ సభ్యుల ఎంపికకు ఎలాంటి ప్రమాణాలు అమలవుతున్నాయనే ప్రశ్నకు సమాధానం అవసరమని ఆయన అన్నారు.

పేషెంట్లకు అర్హతలు అడిగే ముందు డాక్టర్‌కు అర్హతలేమిటో కూడా చూడాలి. అదే విధంగా జర్నలిస్టుల అర్హతలను పరిశీలించే కమిటీల్లో సభ్యులుగా ఉన్నవారి పాత్రికేయ అనుభవం, వృత్తి నైపుణ్యం, క్షేత్రస్థాయి అనుభవం వంటి అంశాలపై కూడా స్పష్టత ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు.




కొన్ని కమిటీల్లో నిజాయితీగా పనిచేసే సభ్యులు ఉన్నప్పటికీ, ఆధిపత్య ధోరణులు నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నాయనే అభిప్రాయం పాత్రికేయుల్లో వ్యక్తమవుతోందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా పారదర్శక వ్యవస్థను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు.

ప్రస్తుత ప్రభుత్వం, సమాచార శాఖ మంత్రి జర్నలిస్టుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తున్నారని, అర్హులైన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ అందాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. అయితే ఆ ఉద్దేశం క్షేత్రస్థాయిలో పూర్తిగా అమలవుతున్నదా.? అనే అంశంపై సమీక్ష అవసరమని సూచించారు.

అక్రిడిటేషన్ ప్రక్రియలో పారదర్శకత పెరగాలంటే కమిటీ సభ్యుల ఎంపికకు కూడా స్పష్టమైన అర్హతలు, నైతిక ప్రమాణాలు, జవాబుదారీతనం ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి దరఖాస్తును నిష్పాక్షికంగా పరిశీలించి, నిజంగా వృత్తిని నమ్ముకుని పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

జర్నలిస్టుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థపై విశ్వాసం పెరగాలంటే నిర్ణయాలు పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అభ్యంతరాలు వ్యక్తమైతే వాటిని ప్రభుత్వం పరిశీలించి అవసరమైన సంస్కరణలు చేపట్టాలని పర్కాల సమ్మయ్య గౌడ్ విజ్ఞప్తి చేశారు.నిజమైన వర్కింగ్ జర్నలిస్టులకు న్యాయం జరగడం, అక్రిడిటేషన్ వ్యవస్థపై విశ్వాసం నిలవడం ప్రజాస్వామ్యానికి కూడా అవసరం, అని ఆయన పేర్కొన్నారు.

## ఎర్ర పెద్ద ఇద్దయ్య నీ పరామర్శించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ గారు






గుడిపల్లి మండల కేంద్రానికి చెందిన బిఆర్ ఎస్ పార్టీ నాయకులు ఎర్ర యాదగిరి తండ్రి ఎర్ర పెద్ద ఇద్దయ్య ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ లో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఎర్ర పెద్ద ఇద్దయ్య నీ దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ గారు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఆయన వెంట పలువురు బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
04 శనివారం జూలై 2026

# ఆహార భద్రతపై నటి కాజల్ అగర్వాల్ సంచలన వ్యాఖ్యలు



ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ దేశంలోని ఆహార భద్రత, నాణ్యతపై సంచలన వ్యాఖ్యలు చేశారు. మనమంతా మనకు తెలియకుండానే ఒక సమాంతర భ్రమల్లో బతుకుతున్నామని, దేశంలో ఆహార కల్తీ, భద్రతకు సంబంధించిన వాస్తవాలు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఆమె తాజా చిత్రం 'ది ఇండియా స్టోరీ'ప్రమోషన్స్ సందర్భంగా ఐఏఎన్ఎస్ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కాజల్ ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

ఈ సినిమా కథ, దానికి సంబంధించిన పరిశోధనా పత్రాలు తన వద్దకు వచ్చినప్పుడు దేశంలోని నిజా నిజాలు చూసి తాను షాక్‌కు గురయ్యానని కాజల్ చెప్పారు. "మన చుట్టూ ఉన్న వాస్తవాలను పట్టించుకోకుండా, మనకు నచ్చిన చిన్న ప్రపంచంలో (బబుల్‌లో) మనం ఎంతో సౌకర్యవంతంగా బతికేస్తున్నాం. కానీ, నిజానికి ఇది ముమ్మాటికీ కపటత్వమే అవుతుంది. ఈ భయంకరమైన నిజాన్ని సమాజానికి చూపించాల్సిన, దీనిపై మాట్లాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని నేను భావించాను. ప్రజల్లో అవగాహన కల్పించడమే ఇందులో మొదటి అడుగు. ఏదైనా ఒక సమస్య గురించి తెలిసినప్పుడే కదా, దానిని పరిష్కరించడానికి మనం ముందడుగు వేస్తాం. ఈ కథ నా కళ్లు తెరిపించింది. అయితే, సమాజంలోని ఈ చేదు నిజం నన్ను తీవ్రంగా కలచివేసింది" అని కాజల్ ఆవేదన వ్యక్తం చేశారు.

నిద్ర లేకుండా ఎన్నో రాత్రులు

ఈ సినిమా పరిశోధనల్లో తెలిసిన విషయాల వల్ల తాను ఎన్నో రాత్రులు నిద్ర లేకుండా గడిపానని కాజల్ అగర్వాల్ వెల్లడించారు. "నేను షూటింగ్ ముగించుకుని ఇంటికి వెళ్లాక కూడా ఈ సినిమా కథ గురించే ఆలోచించేదాన్ని. నా భర్తతో దీనిపై సుదీర్ఘంగా చర్చించాను. మనం ఇకపై చాలా జాగ్రత్తగా ఉండాలని, నిత్యావసర సరుకులు, కూరగాయలను ఒక నమ్మకమైన నిర్దిష్ట ప్రాంతం నుండే కొనాలని ఆయనకు చెప్పాను. ఈ సినిమా కేవలం ఒక నటిగానే కాకుండా, నా కుటుంబం పట్ల బాధ్యత కలిగిన ఒక వ్యక్తిగా నాలో అంతర్గతంగా ఎంతో మార్పు తెచ్చింది. ఒక తల్లిగా, నా తల్లిదండ్రుల క్షేమాన్ని కోరుకునే కూతురిగా నా వారికి అత్యంత సురక్షితమైన ఆహారాన్ని అందించాలని నిర్ణయించుకున్నాను. చివరకు నా స్నేహితులకు ఫోన్ చేసి అలర్ట్ చేశాను. పెద్ద పెద్ద గౌర్మెట్ లగ్జరీ స్టోర్స్‌ను కూడా మనం గుడ్డిగా నమ్మలేమని, ప్యాకెట్ల వెనుక ఉండే ఫుడ్ సేఫ్టీ స్టాంప్స్ , సర్టిఫికేషన్లను కచ్చితంగా తనిఖీ చేయాలని వారికి సూచించాను" అని కాజల్ పేర్కొన్నారు.

24న సినిమా విడుదల

సామాజిక స్పృహతో కూడిన అంశంతో తెరకెక్కిన 'ది ఇండియా స్టోరీ' చిత్రానికి స్వాతి వినాయక్ సైందానే, అనితా జాదవ్, వినాయక్ సైందానే, కల్పేష్ షా, దేవయాని ఖోరతే, ప్రేమ్ జోషిలు నిర్మాతలుగా వ్యవహరించారు. దేశంలో ఆహార రంగంలోని లోపాలను, కల్తీ మాఫియా గుట్టును రట్టు చేసేలా రూపొందిన ఈ చిత్రం జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# ఫ్రాన్స్‌లో రాజమౌళికి అరుదైన గౌరవం... 'వాల్ ఆఫ్ ఫిల్మ్‌మేకర్స్'పై జక్కన్న పేరు




ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. చలనచిత్ర రంగానికి పురిటిగడ్డగా భావించే ఫ్రాన్స్‌లోని లయోన్‌లో ఉన్న ప్రతిష్ఠాత్మక 'ఇన్‌స్టిట్యూట్ లుమియర్' ఆయన్ను ఘనంగా సత్కరించింది. అక్కడి ప్రఖ్యాత 'వాల్ ఆఫ్ ఫిల్మ్‌మేకర్స్' పై రాజమౌళి పేరుతో శాశ్వత స్మారక ఫలకాన్ని ప్రతిష్టించింది. ఈ అరుదైన గౌరవం ద్వారా మార్టిన్ స్కోర్సెసీ, క్లింట్ ఈస్ట్‌వుడ్, క్వెంటిన్ టరంటినో, ఫ్రాన్సిస్ ఫోర్డ్ కపోలా వంటి ప్రపంచ ప్రఖ్యాత దిగ్గజ దర్శకుల సరసన రాజమౌళి నిలిచారు. జూలై 1, 2 తేదీల్లో జరిగిన ఈ వేడుక అనంతరం రాజమౌళి తన అనుభూతులను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.

"లుమియర్ మ్యూజియంను సందర్శించాను. నా సినిమాలు 'ఈగ', 'ఆర్ఆర్ఆర్' ప్రదర్శితమవుతున్న స్క్రీనింగ్ రూమ్‌కు వెళ్ళిన సమయంలో ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ థియరీ ఫ్రెమాక్స్ నన్ను అక్కడి ప్రేక్షకులకు పరిచయం చేసి, ఒక సర్ ప్రైజ్ ఉందని చెప్పారు. నన్ను సినిమా పుట్టిన వీధిలోకి తీసుకెళ్లగా, అక్కడ ప్రపంచ ప్రఖ్యాత దర్శకుల పేర్లతో కూడిన ఫలకాలు కనిపించాయి. ఎరుపు రంగు వస్త్రంతో కప్పి ఉన్న ఒక ఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. దానిపై నా పేరు చూసి ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యాను. ఈ అరుదైన గౌరవానికి వినమ్రంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను" అని రాజమౌళి వివరించారు. ఇటీవలే పారిస్‌లోని 'సినీమాథెక్ ఫ్రాన్సైస్' థియేటర్‌లో రాజమౌళి పేరుతో ఒక శాశ్వత సీటును కేటాయించిన సంగతి తెలిసిందే. తాజా గౌరవంతో ఆయన అంతర్జాతీయ ఖ్యాతి మరో మెట్టు ఎక్కింది. జూన్ చివరి వారం నుంచి జూలై మధ్య వరకు ఇన్‌స్టిట్యూట్ లుమియర్ రాజమౌళి చిత్రాలైన 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాలతో ప్రత్యేక 'రెట్రోస్పెక్టివ్'ను నిర్వహిస్తోంది.

# ప్రతి రోజు ఒక కొత్త బ్రాండ్: కోట్లు కొల్లగొడుతున్న జాన్వీ!



బాలీవుడ్ స్టార్ కిడ్, టాలీవుడ్ క్రేజీ బ్యూటీ జాన్వీ కపూర్ వెండితెరపైనే కాదు.. డిజిటల్ ప్రపంచంలోనూ తిరుగులేని సామ్రాజ్యాన్ని సృష్టిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 2.67 కోట్లకు పైగా ఉన్న ఫాలోయింగ్, ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఉన్న క్రేజ్‌ను ఈ యంగ్ బ్యూటీ క్యాష్ చేసుకుంటున్న తీరు చూస్తుంటే ట్రేడ్ వర్గాలు సైతం ముక్కున వేలేసుకుంటున్నాయి. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు ఈ భామతో ప్రమోషన్స్ చేయించేందుకు క్యూ కడుతుండటంతో జాన్వీ సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీల డిజిటల్ షోరూమ్‌లుగా మారిపోయాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో జాన్వీ కపూర్ పోస్ట్ చేసే ఒక్కో ప్రమోషనల్ కంటెంట్ వెనుక భారీ వ్యాపార సామ్రాజ్యం దాగి ఉంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం..ఈ భామ ఒకే ఒక్క యాడ్ పోస్ట్ లేదా రీల్ కోసం సుమారు 7 లక్షల నుండి 10 లక్షల వరకు వసూలు చేస్తోంది. అలాగే ఎక్స్ ఖాతాలో చేసే పోస్టులకు లక్షల్లో డిమాండ్ చేస్తోంది. కేవలం విడివిడి పోస్టులే కాకుండా ఒప్పో, లెన్స్‌కార్ట్, తుమి, హావెల్స్ వంటి అగ్రశ్రేణి కంపెనీలకు గంపగుత్తగా (బల్క్ ప్యాకేజీ) బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ.. ఏడాదికి 1 కోటి నుండి 2.5 కోట్ల వరకు ఒప్పందాలు కుదుర్చుకుంటోందని టాక్ వినిపిస్తోంది. నెలవారీ లెక్కలు చూస్తే.. జాన్వీ కపూర్ డిజిటల్ ఆదాయం ఊహకందని స్థాయిలో ఉంది. ఒక నెలలో కనీసం డజనుకు పైగా విభిన్న బ్రాండ్స్ (లైఫ్ స్టైల్, గ్యాడ్జెట్స్, బ్యూటీ ప్రొడక్ట్స్) ప్రకటనలను నిరంతరాయంగా పోస్ట్ చేస్తూనే ఉంటుంది. ఈ రకంగా చూసినా.. సోషల్ మీడియా వేదికల ద్వారానే ఈ బ్యూటీ నెలవారీ ఆదాయం 1.5 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ప్రస్తుతం డిజిటల్ మార్కెట్లో ఇంతటి క్రేజ్, కమర్షియల్ వాల్యూ ఉన్న మరో స్టార్ బ్యూటీ బాలీవుడ్‌లో లేరనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కేవలం డిజిటల్ ప్రమోషన్స్ మాత్రమే కాకుండా... సినిమాల పరంగానూ జాన్వీ కపూర్ పారితోషికం ఆకాశాన్ని తాకుతోంది. హిందీ చిత్రసీమలో ఈ భామ నటిస్తున్న ఒక్కో సినిమాకు బడ్జెట్ - ప్రొడక్షన్ హౌస్‌ను బట్టి సుమారు 5 కోట్ల నుండి 6 కోట్ల వరకు రెమ్యునరేషన్ అందుకుంటోంది. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలతో పాటు గ్లామర్ పాత్రలకు సమన్యాయం చేస్తుండటంతో బాలీవుడ్ మేకర్స్ ఈ యంగ్ బ్యూటీ అడిగినంత ఇచ్చేందుకు వెనుకాడటం లేదు. మరోవైపు.. సౌత్ ఇండియాలో (టాలీవుడ్‌లో) జాన్వీ కపూర్ ఎంట్రీ ఒక సంచలనంగా మారింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన నటించిన -దేవర- చిత్రానికి గానూ దాదాపు 2 కోట్ల నుండి 3 కోట్ల వరకు పారితోషికం అందుకున్నట్లు టాలీవుడ్ టాక్. ఇక గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ క్రేజీ ప్రాజెక్ట్ -పెద్ది- కోసం దాదాపు 4 కోట్ల పారితోషికాన్ని వసూలు చేసిందని ప్రచారం ఉన్నా.. దానిపై అధికారికంగా క్లారిటీ లేదు. ఇలా సినిమాలు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ జాన్వీ కపూర్ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది.

# శోభిత మేడం గుడ్ న్యూస్ చెప్పేది ఎప్పుడో?



నాగ చైతన్య, శోభిత ధూళిపాల జంట గురించి సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా ఏదో ఒక వార్త వింటూనే ఉంటాం. ఆ మధ్య శోభిత సినిమాలకు బ్రేక్ తీసుకుందని, ఆమె గర్భం దాల్చడం వల్లే సినిమాలకు బ్రేక్ తీసుకుందనే వార్తలు జోరుగా వినిపించాయి. ఆ తర్వాత మీడియాలో వచ్చిన వార్తలు కేవలం పుకార్లే అని ఆమె టీం మెంబర్స్ కొందరు కొట్టి పారేశారు. నాగార్జున సైతం సమయం వచ్చినప్పుడు తప్పకుండా అందరికీ తెలియజేస్తాము, అంతా మంచి జరగాలని కోరుకుంటున్నాం అన్నట్లుగా చేసిన వ్యాఖ్యలు ఆ సమయంలో శోభిత ప్రెగ్నెంట్ అనే వార్తలకు బ్రేక్ వేసినట్లు అయ్యింది. నాగార్జున వ్యాఖ్యల తర్వాత మీడియాలో శోభిత గర్భం విషయమై చర్చ ఆగి పోయింది. అయితే ఇటీవల సమంత ప్రెగ్నెంట్ అనే విషయం అధికారికంగా బయటకు వచ్చినప్పటి నుంచి మళ్లీ శోభిత గర్భం విషయమై సోషల్ మీడియాలో కొందరు కామెంట్ చేస్తున్నారు. శోభిత ప్రెగ్నెంట్ అంటూ వార్తలు.. సాధారణంగా పెళ్లి అయిన హీరోయిన్స్ ప్రెగ్నెన్సీ వార్తలు రెగ్యులర్‌గా వస్తూనే ఉంటాయి. ఏ హీరోయిన్ పెళ్లి అయినా ఏడాదికో రెండేళ్లకో ఆ హీరోయిన్ ప్రెగ్నెంట్ అయ్యిందంటా అంటూ వార్తలు రావడం సహజం. చాలా మంది హీరోయిన్స్ ఆ వార్తలను కొట్టి పారేసిన సందర్భాలు ఉన్నాయి. కొన్ని సార్లు మాత్రం ఆ వార్తలు నిజమే అన్నట్లుగా హీరోయిన్స్ బేబీ బంప్ ఫోటోలు షేర్ చేయడం మనం చూస్తూ ఉన్నాం. ఆ మధ్య సమంత గర్భవతి అంటూ వార్తలు వచ్చాయి. మా ఇంటి బంగారం సినిమా ప్రమోషన్ సమయంలో సమంత ప్రెగ్నెన్సీ గురించి ప్రముఖంగా చర్చ జరిగింది. ఆ వార్తలను నిజమే అన్నట్లుగా సమంత తాజాగా తన బేబీ బంప్ ఫోటోను షేర్ చేయడంతో పాటు, జీవితంలో చాలా సంతోషకరమైన సందర్భం అన్నట్లుగా వ్యాఖ్యలు చేయడంతో అంతా కూడా ఆమెకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ జూనియర్ కోసం వెయిట్ చేస్తున్నామని మెసేజ్‌లు చేస్తున్నారు. నాగ చైతన్య, శోభిత జంటకు... ఇదే సమయంలో నాగ చైతన్య, శోభితలు ఎప్పుడు తల్లిదండ్రులు అవుతారా అని అక్కినేని ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. గతంలోనే వార్తలు వచ్చినప్పటికీ వాటిని కొట్టి పారేశారు. ఇప్పుడు మరోసారి శోభిత ఎప్పుడు గుడ్ న్యూస్ చెబుతుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. నటిగా శోభిత బిజీగా ఉన్నప్పటికీ అక్కినేని ఫ్యాన్స్ కోసం వారసుడిని ఇవ్వాలని అంతా కోరుకుంటున్నారు. చనిపోయిన అక్కినేని నాగేశ్వరరావు గారికి శోభిత జన్మనివ్వాలని సీనియర్ అక్కినేని ఫ్యాన్స్ కోరుతున్నారు. మరో వైపు అఖిల్ వైపు కూడా అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వీరిద్దరిలో ఎవరు ముందుగా నాగార్జునను తాత చేస్తారా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికీ కొడుకులకు ఏమాత్రం తగ్గకుండా నాగార్జున వరుస సినిమాలు చేస్తూ, హ్యాండ్సమ్ లుక్‌తో అదరగొడుతున్నాడు. మనవడు వచ్చిన తర్వాత కూడా నాగ్ సిల్వర్ స్క్రీన్ ను దున్నేయాలంటూ ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

# సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది




సత్యదేవ్ కథానాయకుడిగా నటించిన పీరియాడిక్ సైకలాజికల్ థ్రిల్లర్ 'రావు బహదూర్' నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. వెంకటేష్ మహా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చింతా గోపాలకృష్ణారెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్‌చంద్ర నిర్మించారు. అగ్ర హీరో మహేష్‌బాబు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో దర్శకుడు వెంకటేష్ మహా మాట్లాడుతూ 'వైవిధ్యమైన కథ ఇది. ప్రేక్షకులకు మునుపెన్నడూ చూడని సరికొత్త అనుభూతినందిస్తుంది. పూర్తిగా ఒరిజినల్ కథగా తెరకెక్కించాం. ఎలాంటి రెఫరెన్స్‌లు లేవు. ప్రేక్షకుల్ని నవ్విస్తుంది. ఆశ్చర్యపరుస్తుంది' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ఈ సినిమా ప్రేక్షకులకు ఓ సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది. చాలా కాలం గుర్తుండిపోతుంది. తప్పకుండా థియేటర్లలో చూసి ఆనందించండి' అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.





